



### తిరువణ్ణామలైలో

# ఆడిపూర ఉత్సవాల ప్రారంభం

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో ఆడిపూర బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆడిపూర ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయాత్పూర్వం ఆలయం తెరచి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తర్వాత అమ్మవారి సన్నిధి ముందు పరాశక్తి అమ్మవారు కొలువుదీరారు. శివాచార్యుల వేదమంత్రాలు పఠిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధానార్చకులు, శైవాగమ పండితులు ధ్వజారోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ దేవాదాయ శాఖ జోనల్ డిప్యూటీ కమిషనర్ సుదర్శన్, ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ ఇరా జీవానందం, సభ్యులు గోమతి, సినమ్ పెరుమాళ్, మేనేజర్ సెంథిల్ తదితరులు పాల్గొన్నారు. పది రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో రోజూ ఉదయం, సాయంత్రం వినాయకస్వామి, పరాశక్తి అమ్మవారు వివిధ వాహనాల్లో మాడవీధుల్లో ఊరేగనున్నారు. పదో రోజు ఆలయ ప్రాంగణంలోని శివగంగ కొలనులో తీర్థవారి, తర్వాత అమ్మవారి సన్నిధి ముందు అగ్ని గుండ ప్రవేశం జరుగుతుంది.



ధ్వజారోహణం చేస్తున్న శివాచార్యులు



సర్వాలంకరణ శోభితంగా కొలువైన పరాశక్తి అమ్మవారు

### ఇంజనీరింగ్

# జనరల్ కేటగిరీ కౌన్సెలింగ్ ప్రారంభం

అడయార్, జూలై 29: ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా జనరల్ విభాగంలో విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు 7.5 శాతం రిజర్వేషన్ కింద కౌన్సెలింగ్ ప్రారంభించారు. అన్నా విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 433 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా, వీటిలో ప్రభుత్వ కోటా కింద 79,938 సీట్లున్నాయి. వాటి భర్తీ కోసం ఈ నెల 22 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. తొలి విడతలో 7.5 రిజర్వేషన్ల కింద ప్రభుత్వ పాఠశాలలు, జనరల్ విభాగాల్లో స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఇందులో జనరల్ స్పెషల్ కేటగిరీ విద్యార్థులు 836 మంది, 7.5 శాతం రిజర్వేషన్ కోటా స్పెషల్ కేటగిరీలో 92 మంది మాత్రమే చేరారు. సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో 7.5 శాతం రిజర్వేషన్, జనరల్ కేటగిరీ సీట్లకు కౌన్సెలింగ్ ప్రారంభించారు. మొత్తం మూడు రౌండ్లలో ఆగస్టు 10వ తేదీ వరకు జరుగుతుంది. ఇందులో జనరల్ కేటగిరీలో 26,654 సీట్లు, 7.5 రిజర్వేషన్ కింద 1,343 సీట్లున్నాయి. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఎంపిక చేసుకునే కాలేజీ తాత్కాలిక కేటాయింపు ఆర్డర్ కాపీ ఆగస్టు ఒకటో తేదీ ఉదయం పది గంటల్లోపు ప్రకటిస్తారు. ఈ తాత్కాలిక కేటాయింపు నిర్ధారించే విద్యార్థులకు ఆగస్టు 1, 2 తేదీల్లో కాలేజీ ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. కాలేజీని ఎంపిక చేసుకునే విద్యార్థులకు ఆగస్టు 3న కాలేజీ ఫైనల్ సెలక్షన్ చేస్తారు. వారంతా ఆగస్టు 7వ తేదీలోగా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఒక వేళ మరింత మెరుగైన కాలేజీలో సీటు పొందగోరు విద్యార్థులు తగిన రుసుం చెల్లించి ఆగస్టు 7వ తేదీ వరకు వేచి చూడాల్సి ఉంటుంది. అంతేకాకుండా, తమకు నచ్చిన కాలేజీ లభించలేదని భావించే విద్యార్థులు మరో రౌండ్ కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

## పుదువై ప్రభుత్వంలో రేగిన చిచ్చు?

● రంగస్వామికి బీజేపీ ఎమ్మెల్యేల సవాల్



పుదుచ్చేరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామికి ఆ రాష్ట్రానికి చెందిన ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేలు సవాల్ విసిరారు. వచ్చే నెల ఏడో తేదీ అసెంబ్లీలో తాము లేకుండా బడ్జెట్ ఎలా ప్రవేశపెడతారో చూస్తామంటూ హెచ్చరించినట్లు తెలిసింది. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై అనేక రాష్ట్రాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. బీజేపీ భాగస్వామిగా ఉన్న పుదుచ్చేరి పట్ల ఆమె దయ చూపలేదంటూ పుదుచ్చేరి డీఎంకే అధ్యక్షుడు శివ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం సోమవారం జరిగిం ది. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. పుదుచ్చేరిని అభివృద్ధిచెందిన రాష్ట్రంగా చేస్తామంటూ ప్రకటనలు చేసిన బీజేపీ పాలకులు.. గత లోక్‌సభ ఎన్నికల్లో పుదువై ఓటర్లు ఆ పార్టీకి ఓటు వేయలేదన్న అక్కసుతో ఒక్క రూపాయి నిధిని కూడా కేటాయించలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇటీవల పుదుచ్చేరి వచ్చిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ నిర్మల కుమార్ సురానాతో ముఖ్యమంత్రి రంగస్వామి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో పుదుచ్చేరికి తగినన్ని కేటాయింపులు జరగలేదన్నారు. అంతేగాక బీజేపీ ఎమ్మెల్యేలు తన ప్రభుత్వంపైనే విమర్శలు చేస్తున్నారని వాపోయిన ఆయన.. బీజేపీ వల్ల తామే నష్టపోయామని, అలాంటిది తమపైనే ఆరోపణలు చేస్తే ఎలాగని నిలదీసినట్లు సమాచారం. మరీ ముఖ్యంగా బీజేపీ ఎమ్మెల్యేలు కల్యాణసుందరం, జాన్‌కుమార్, రిచర్డ్, అంగాలన్, శివశంకర్, అశోక్‌లను కట్టడి చేయాలని తెగేసిచెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీ అసమ్మతి ఎమ్మెల్యేలు రంగస్వామితో తాడేపేడో తేల్చుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వచ్చే నెల 7వ తేదీ అసెంబ్లీలో బడ్జెట్‌ను ఎలా ప్రవేశపెడతారో చూస్తామంటూ సవాల్ విసిరినట్లు తెలిసింది. ఈ వ్యవహారం పుదుచ్చేరి రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తోంది.

# 10 జిల్లాల్లో పంచాయతీ యూనియన్ భవనాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్



కొత్త భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో రూ.71.94 కోట్లతో పది జిల్లాల్లో నిర్మించిన 19 పంచాయతీ యూనియన్ కార్యాలయాల భవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. సోమవారం ఉదయం సచివాలయం నుంచి ఆ భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించడంతోపాటు ఆయా పంచాయతీ యూనియన్ల అధికారుల కోసం రూ.35.25 కోట్లతో కొనుగోలు చేసిన 391 వాహనాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. శివగంగ, తేని, తిరువారూరు, కళ్ళకుర్చి, మదురై, రామనాథపురం, తిరువణ్ణామలై, కన్నికుమారి, తిరుచ్చి, వేలూరు జిల్లాలో ఈ పంచాయతీ యూనియన్ కార్యాలయ భవనాలను నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, పెరియసామి, ఈవీ వేలు, టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, గ్రామీణాభివృద్ధి పంచాయతీ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ పి.పొన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆవిన్ డెయిరీల ప్రారంభం...

సచివాలయంలో రాష్ట్ర పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థ (ఆవిన్) ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో రూ.43.61 కోట్లతో పూర్తయిన నాలుగు పథకాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభోత్సవం చేశారు. కొత్త పశుదాణా కర్మాగారానికి శంకుస్థాపన చేశారు. కరూరు జిల్లా తోరణకల్‌పట్టిలో రూ.2.30కోట్లతో రోజుకు 50 వేల లీటర్ల పాలు ఉత్పత్తి చేయగల సామర్థ్యంతో కూడిన డెయిరీని, తిరువణ్ణామలై జిల్లా వేంగికాల్‌లో రూ.2.85 కోట్లతో నిర్మించిన రోజుకు 50 లీటర్ల పాలను ఉత్పత్తి చేయగల సామర్థ్యం కలిగిన డెయిరీని ఆయన ప్రారంభించారు. ఇదే విధంగా తిరువళ్లూరు జిల్లా కాకలూరు డెయిరీలో రూ.3.67 కోట్లతో రోజుకు 5వేల లీటర్ల కెపాసిటీ కలిగిన కర్మాగారాన్ని, మాధవరంలో రూ.1.89కోట్ల తో నిర్మించిన పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించారు. కడలూరు జిల్లా దిట్టకుడిలో రూ.33 కోట్లతో రోజుకు 300 మెట్రిక్ టన్నుల పశుదాణా ఉత్పత్తి కర్మాగారానికి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఆర్ గాంధీ, సీవీ గణేషన్, మనో తంగరాజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే గోపాల్, డెయిరీ అభివృద్ధి శాఖ సంచాలకులు ఆవిన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వినీత్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ అధికారుల కోసం కొనుగోలు చేసిన వాహనాలను ప్రారంభిస్తున్న స్టాలిన్



సోమవారం సచివాలయంలో ఆవిన్ సంస్థ డెయిరీలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్




### తిరువేర్కాడులో

# భారీ చోరీ

● ఇంజనీర్ ఇంట్లో ముసుగు దొంగల చేతివాటం

ప్యారీస్, జూలై 29: స్థానిక తిరువేర్కాడు ఈజీపీ నగర్‌కు చెందిన జనార్ధనన్ అనే ఇంజనీర్ ఇంట్లో చొరబడిన ముసుగు దొంగల ముఠా 103 సవర్ల నగలు దోచుకుని పరారైంది. పరారైన ఈ ముఠా ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. రాజధాని నగరం, శివారు ప్రాంతాల్లో మహిళలు ఒంటరిగా ఉన్న ఇళ్లలో చొరబడి నగలు, నగదు కాజేస్తున్న ముఠా తాజాగా తిరువేర్కాడులోని ఇంజనీర్ జనార్ధనన్ ఇంటిపై కన్నేసింది. ఆయన సౌదీ అరేబియాలో భవన నిర్మాణ సంస్థ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన భార్య కోకిల, కుమార్తె తిరువేర్కాడు ఇంట్లో నివసిస్తున్నారు. గత నెల జనార్ధనన్ విదేశాల నుంచి అయనంబాక్కానికి తిరిగొచ్చారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలసి అన్నానగర్‌లో షాపింగ్‌కు వెళ్లారు. రాత్రి 11 గంటలకు ఇంటికి చేరుకొని తాళం వేసిన తలుపులు తెరచి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందారు. లోపలికి వెళ్లి చూసి బీరువాలోని 103 సవర్ల నగలు, రూ.50 వేల నగదు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అందజేసిన సమాచారంతో తిరువేర్కాడు పోలీసులు దోపిడి జరిగిన ఇంటికి వెళ్లి విచారణ జరిపారు. వేలిముద్రలు నమోదు చేయడంతో పాటు ఇంటి లోపల, బయట సీసీ పుటేజీ పరిశీలించారు. అందులో... జనార్ధనన్ కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లిన సమయంలో ముసుగు ధరించిన వ్యక్తులు ఇంటి తాళం బద్దలుకొట్టి లోపలికి రాత్రి 7.35 గంటలకు వెళ్లి 8.15 గంటలకు బయటకు వచ్చిన దృశ్యాలు నమోదయ్యాయి. కేసు నమోదుచేసిన పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా అగంతకుల కోసం గాలిస్తున్నారు. కాగా, ఇంజనీర్ జనార్ధనన్ పదేళ్లుగా సౌదీ అరేబియాలో పనిచేస్తున్నారు. కుమార్తెను చదివించేందుకు మూడు నెలల క్రితమే తిరువేర్కాడు ప్రాంతంలోని అయనంబాక్కంలో అద్దెకు తీసుకున్నారు.

# కంచి మేయర్‌పై వీగిన అవిశ్వాసం

● సభకు గైర్హాజరైన కార్పొరేటర్లు ● గంటన్నరసేపు ఎదురుచూసిన కమిషనర్ సెంథిల్ మురుగన్

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం మేయర్ మహాలక్ష్మికి వ్యతిరేకంగా ప్రతిపాదించిన అవిశ్వాసతీర్మానం వీగిపోయింది. అవిశ్వాస తీర్మానం ఓటింగ్ కోసం సోమవారం ఉదయం ఏర్పాటైన కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. కౌన్సిల్‌హాలులో కమిషనర్ సెంథిల్ మురుగన్ సుమారు గంటన్నర సేపు బ్యాలెట్ బాక్స్‌తో కార్పొరేటర్ల కోసం ఎదురు చూశారు. చివరకు మేయర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాసతీర్మానం వీగిపోయినట్లు ప్రకటించారు. కాంచీపురం కార్పొరేషన్ తొలి మహిళా మేయర్‌గా డీఎంకేకు చెందిన మహాలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసిన మహాలక్ష్మి కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ కోసం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. 2022లో జరిగిన ఎన్నికల్లో గెలిచిన ఆమె మేయర్ పదవి స్వీకరించినప్పటి నుంచి సొంత పార్టీ కార్పొరేటర్లే ఆమెకు వ్యతిరేకిస్తూ ఆమెపై పలు ఆరోపణలు కూడా చేశారు. కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పను లకు సంబంధించి ఆమె ప్రవేశపెట్టిన పలు తీర్మానాలు డీఎంకే సభ్యులతోపాటు అన్నాడీఎంకే, పీఎంకే, కాంగ్రెస్ కార్పొరేటర్లంతా వ్యతిరేకించడంతో ఆ తీర్మానాలన్నీ బుట్టదాఖలయ్యాయి. ఇలా మెజారిటీ కార్పొరేటర్లు మేయర్‌కు వ్యతిరేకం వర్గంగా ఏర్పడం తో పలు స్టాండింగ్ కమిటీల సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఆ తర్వాత జూన్ 7న డీఎంకే, అన్నాడీఎంకే, పీఎంకే, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు సహా 33 మంది కార్పొరేటర్లు మేయర్ మహాలక్ష్మిపై అవిశ్వాసతీర్మానం ప్రతిపాదిస్తూ కమిషనర్ సెంథిల్ మురుగన్‌కు వినతిపత్రం సమర్పించారు. అది సమగ్రంగా లేదంటూ కమిషనర్ దానిని తిప్పి పంపారు. ఆ తర్వాత మళ్లీ ఆ కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసతీర్మానం ప్రవేశపెట్టడానికి సిద్ధమయ్యారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు కూడా వినతి పత్రం సమర్పించారు. అంతే కాకుండా అవిశ్వాసతీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతించకపోవడంతో కోర్టుకు వెళతామని కూడా తెలిపారు. దీంతో చివరకు ఈ నెల 29న మేయర్‌పై అవిశ్వాసతీర్మానంపై ఓటింగ్ జరుగుతుందని, కార్పొరేటర్లంతా హాజరుకావాలంటూ కమిషనర్ నోటీసులు కూడా పంపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు కమిషనర్ సెంథిల్ మురుగన్, ఇతర అధికారులు అవిశ్వాసతీర్మానంపై ఓటింగ్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. 41 మంది కార్పొరేటర్లు సమావేశానికి హాజరై ఓటు వేస్తేనే అవిశ్వాసతీర్మానం నెగ్గుతుందని కమిషనర్ ప్రకటించారు. ఉదయం 10 నుండి 11.30 గంటల వరకూ ఆయన కౌన్సిల్ మీటింగ్ హాలులో కూర్చున్నారు. కార్పొరేటర్లు ఎవరూ రాకపోవడంతో మేయర్ మహాలక్ష్మిపై అవిశ్వాసతీర్మానం వీగిపోయిందంటూ మీడియాకు వెల్లడించి వెళ్ళిపోయారు. డీఎంకేకు చెందిన 35వ వార్డు కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్ కార్పొరేషన్ పరిపాలనా భవనంలోకి వెళ్ళినా మీటింగ్ హాలుకు వెళ్లకుండా, లాబీలో హాజరుపట్టీపై సంతకం కూడా చేయకుండా మేయర్ పదవి నుండి తొలగించాలని ప్రభుత్వానికి ప్రతిపాదన చేయాలని కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం మేయర్ అవిశ్వాసతీర్మానం ఓటింగ్‌లో డీఎంకే సభ్యులు పాల్గొనకూడదంటూ పార్టీ అధిష్టానం ఆదేశాలివ్వటం వల్లే ఆ పార్టీ సభ్యులు ఊటీకి బయలుదేరినట్లు చెబుతున్నారు. మేయర్‌పై తమకున్న వ్యతిరేకతను పార్టీ అధిష్టానానికి తెలిపేందుకే అవిశ్వాసతీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించినట్లు డీఎంకే సభ్యులు పేర్కొంటున్నారు. ఇక సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి అన్నాడీఎంకే, పీఎంకే కార్పొరేటర్లు కూడా హాజరు కాకుండా డీఎంకేకు పరోక్షంగా మద్దతునివ్వటం విశేషం.



మీటింగ్ హాలులో ఎదురుచూస్తున్న కమిషనర్



మేయర్ మహాలక్ష్మి

### రవి పదవీ కాలం

# పొడిగింపు?

● గవర్నర్ల సదస్సుకు కేంద్రం ఆహ్వానం

ఆర్‌ఎన్ రవి



చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీతో ముగియనున్న గవర్నర్ పదవీ కాలం పొడిగించారా?.. ఆయనకు రెండోమారు అవకాశం ఇవ్వాలని ఢిల్లీ పెద్దలు నిర్ణయించారా?.. అవుననే అంటున్నాయి రాజ్‌భవన్ వర్గాలు. ఎందుకంటే ఆగస్టు 1న ఢిల్లీలో జరుగనున్న గవర్నర్ల సదస్సులో పాల్గొనాలంటూ కేంద్రప్రభుత్వం నుంచి ఆర్‌ఎన్ రవికి ఆహ్వానం రావడమే ఇందుకు ఉదాహరణ అని స్పష్టం చేస్తున్నాయి.

2019 ఆగస్టు ఒకటిని ఆర్‌ఎన్ రవి నాగాలాండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆ రాష్ట్రంలో రెండేళ్ల పని చేసిన తర్వాత 2021లో రాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. దీంతో గవర్నర్‌గా ఐదేళ్ల పదవీ కాలం ఈ నెల 31న ముగియనుంది. ఇటీవల దేశవ్యాప్తంగా పది రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను కేంద్రప్రభుత్వం నియమించినప్పటికీ రాష్ట్ర గవర్నర్‌గా ఎవరినీ నియమించకపోవడంతో ఆర్‌ఎన్ రవి పదవీ కాలం పొడిగించనున్నారనే వార్తలు వినిపించాయి. దీనికి తోడు ఇటీవల ఆయన ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఆ సమయంలో గవర్నర్‌గా ఆయనను కొనసాగించేందుకు మోదీ, అమిత్‌షా సుముఖత వ్యక్తం చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం ఆర్‌ఎన్ రవిని రాష్ట్ర గవర్నర్‌గా కొనసాగించాలంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆగస్టు ఒకటిన ఢిల్లీలో జరుగనున్న గవర్నర్ల సదస్సుకు గవర్నర్ హోదాలోనే ఆర్‌ఎన్ రవి ఢిల్లీకి వెళ్లనుండటంతో గవర్నర్‌గా ఆయన కొనసాగుతారని సుస్పష్టమవుతోంది.

# బస్సులను ప్రైవేటు పరం చేయం

● మంత్రి శివశంకర్

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థ బస్‌సర్వీసులను ప్రైవేటు పరం చేసే ప్రసక్తే లేదని రవాణా శాఖ మంత్రి ఎస్‌ఎస్.శివశంకర్ స్పష్టం చేశారు. సోమవారం ఉదయం కడలూరు జిల్లా కోర్టులో ఓ కేసు విచారణకు ఆయన హాజరయ్యారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రవాణా సంస్థ బస్సులను, బస్‌రూట్లను ప్రైవేటు పరం చేయనున్నట్లు పనిగట్టుకుని ప్రధాన ప్రతిపక్ష నాయకుడైన ఎడప్పాడి పళనిస్వామి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. నెల రోజుల క్రితం అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు టీటీవీ దినకరన్ కూడా ఇదే ఆరోపణ చేశారని, ప్రైవేటుపరం చేసే ఆలోచన ఉంటే ముఖ్యమంత్రి ఆదేశానుసారం రవాణా సంస్థకు 7200లకు పైగా కొత్త బస్సులను కొనాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. ఇప్పటికే 1000 బస్సులను కొనుగోలు చేసి జిల్లావారీగా వాటిని నడుపుతున్నామని చెప్పారు. ఇటీవలే 685 మంది డ్రైవర్, కండక్టర్ పోస్టులకు ఎంపిక చేశామని ఆయన తెలిపారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును 58 నుండి 60కి పెంచి పింఛన్ బకాయాలు చెల్లించలేదని ఆయన ఆరోపించారు. మేలో రవాణా సంస్థలో చాలా మంది రిటైర్ అయ్యారని, దీంతో తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిన డ్రైవర్, కండెక్టర్ పోస్టులు నియమించినట్లు ఆయన చెప్పారు. కిలాంబాక్కం బస్ టెర్మినల్‌కు ప్రస్తుతం వేల సంఖ్యలో ప్రయాణికులు వస్తుండడంతో వారి కోసం సిటీ బస్సులను కూడా ఎక్కువ సంఖ్యలో నడుపుతున్నట్లు ఆయన చెప్పారు.



కడలూరు కోర్టులో హాజరై వస్తున్న మంత్రి ఎస్ఎస్ శివశంకర్

## సమాచార ధ్వని

### మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో ఎంఏ తెలుగులో ప్రవేశాలు

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరంలో వున్న మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో ఎంఏ (తెలుగు)లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు ధర రూ.58, నమోదు రుసుం రూ.2చెల్లించి https://www.tngasa.in/ లింక్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిఉన్నవారు ఆగస్టు 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సివుంటుందని తెలుగు విభాగ అధ్యక్షురాలు డాక్టర్ ఎలిజబెత్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9940012609, 9543430678 మొబైల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

### డిసెంబరు 1న సైనిక కళాశాల రాతపరీక్ష

ఐసిఎఫ్, జూలై 29: డెహ్రాడూన్‌లోని భారత సైనిక కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి రాతపరీక్ష డిసెంబరు 1వ తేది జరుగనుందని టీఎన్‌పీఎస్సీ తెలిపింది. ఈ కళాశాలలో 2025 జూలై సెమిస్టర్‌లో 8వ తరగతిలో విద్యార్థులు చేరేందుకు చెన్నై సహా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో రాతపరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. విద్యార్థులు www.rimc.gov.in అనే వెబ్‌సైట్‌లో రూ.600 చెల్లించి సెప్టెంబరు 30వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు టీఎన్‌పీఎస్సీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

### మార్చిలో రాష్ట్రస్థాయి పడవ పోటీలు

ఐసిఎఫ్, జూలై 29: సీఎం ఎంకే స్టాలిన్ జన్మదినం సందర్భంగా మార్చిలో రాష్ట్రస్థాయి పడవ పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... వచ్చే ఏడాది మార్చిలో సీఎం పుట్టినరోజు సందర్భంగా ఇంజంబాక్కంలో రాష్ట్రస్థాయిలో పడవ పోటీలు నిర్వహించి మొదటి బహుమతిగా రూ.5 లక్షలు, రెండో బహుమతి రూ.3 లక్షలు, మూడవ బహుమతిగా రూ.2 లక్షలు అందజేస్తామని పేర్కొన్నారు.

### తాత్కాలిక ప్రాతిపదికన 5,669 గౌరవ లెక్చరర్లు

పెరంబూర్, జూలై 29: కళాశాలల్లో 11 నెలల తాత్కాలిక ప్రాదిపదికన 5,699 మంది గౌరవ లెక్చరర్లు కొనసాగేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. వీరికి నెలకు రూ.25,000 చొప్పున వేతనం అందించేందుకు రూ.156.72 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది.

### కుట్రాలంలో స్నానాలకు నిషేధం

ఐసిఎఫ్, జూలై 29: కుట్రాలంలో పర్యాటకుల స్నానాలకు అటవీ శాఖ అధికారులు నిషేధం విధించారు. ప్రస్తుతం కుట్రాలంలో సీజన్ ఆహ్లాదకరంగా ఉంది. అయినప్పటికీ, పశ్చిమ కనుమల ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తుండడంతో జలపాతాల్లో ప్రవాహం ఉధృతిగా ఉండడంతో భద్రతా దృష్ట్యా స్నానాలకు అధికారులు అనుమతి నిరాకరించారు.

### ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ పిల్లలకు ఉచిత టీకాలు

పెరంబూర్, జూలై 29: కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో చిన్నారులకు ఉచితంగా టీకాలు వేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. పుట్టిన నెల నుంచి 16 విడతలుగా ఈ టీకాలు ఉచితంగా పొందవచ్చు. ఈ పథకాన్ని త్వరలో ప్రారంభించనున్న ప్రభుత్వం, ఆయా ప్రైవేటు ఆస్పత్రుల వివరాలను అధికారికంగా వెల్లడించనున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

### రూ.26 కోట్లతో ఫుట్‌పాత్‌లు

ఐసిఎఫ్, జూలై 29: నగరంలో 16 ప్రాంతాల్లో రూ.26 కోట్లతో ఫుట్‌పాత్ నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. ఇదివరకే మెరీనా, బీసెంట్ నగర్ సముద్ర తీర ప్రాంతాల్లో ఏర్పాటుచేయగా, ప్రస్తుతం డౌటన్ రిథర్డ్రన్ రోడ్డు, ఎంకేబీ నగర్ పోస్టాఫీసు, మీనంబాకం రోడ్డు, సెంట్రల్ అవెన్యూ, వ్యాసర్పాడి సత్యమూర్తి మెయిన్ రోడ్డు, రాజాఅన్నామలైపురం,నంగనల్లూర్‌లో ఉన్న 16 ప్రాంతాల్లో బస్సు మార్గాల పక్కన ఈ ఫుట్‌పాత్‌లు ఏర్పాటుచేస్తున్నామని, అక్కడక్కడ సెల్ఫీ పాయింట్లు కూడా చోటుచేసుకుంటాయని తెలిపారు.

### 9.2 లక్షల మందికి లివర్ అలెర్జీ టీకాలు

ఐసిఎఫ్, జూలై 29: రాష్ట్రంలో 9.2 లక్షల మంది పిల్లలకు లివర్ అలెర్జీ టీకా వేస్తున్నట్లు ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 300 మిలియన్ ప్రజలు కాలేయ వ్యాధులకు గురికాగా, భారతదేశంలో 1.34 మిలియన్ మంది ఉన్నారన్నారు. మరణాలకు సంబంధించిన సాధారణ కారణాల్లో కాలేయ అలెర్జీ 10వ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రానికి సంబంధించి ఈ వ్యాధికి గురైన వారిలో పిల్లలు ఎక్కువగా ఉన్నారని, దీనిని అడ్డుకొనేందుకు హైపటైటిస్-బి వ్యాక్సిన్ జన్మించిన 24 గంటల్లోనే వేస్తున్నామని, దాంతోపాటు 6,10,14వ వారాల్లో డోస్ పెంచి వేస్తున్నామని, ప్రస్తుతం రాష్ట్రంలో 9.2 లక్షలమంది పిల్లలకుటీకాలు వేస్తున్నామని తెలిపారు.

### పెరుగుతున్న పవన విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, జూలై 29: రాష్ట్రంలో పవన విద్యుదుత్పత్తి పెరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ వినియోగం రోజుకు 16,381 మెగావాట్లుగా ఉంది. నైరుతి రుతుపవనాలు తీవ్రరూపం దాల్చడంతో విండ్ మిల్లులు అదనంగా ఉత్పత్తి చేస్తున్నాయి. సీజన్‌లో 4,000 మెగావాట్ల విద్యుత్ లభిస్తుండగా, వారం రోజులుగా ఉత్పత్తి క్రమేణా పెరుగుతూ ఆదివారం గరిష్ఠంగా 4,765 మెగావాట్లకు చేరుకుంది. అలాగే, రాష్ట్రంలో ప్రస్తుతం సోలార్ విద్యుదుత్పత్తి 4,964 మెగావాట్లుగా ఉందని అధికారులు తెలిపారు.

### విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెరంబూర్, జూలై 29: ఆలయ ఉత్సవాలకు ఏర్పాటుచేసిన స్తంభం తొలగించే సమయంలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన పొన్నేరి సమీపంలో చోటుచేసుకుంది. చిన్నకవాన్ ఆలయ ఉత్సవాలు ఇటీవల వైభవంగా ముగిశాయి. వేడుకల సందర్భంగా ఆలయానికి వేసిన విద్యుద్దీపాలను సౌండ్ సర్వీస్ షాపులో పనిచేసే మోహన్ (25) తొలగించే సమయంలో హఠాత్తుగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### 10 మేకలను చంపిన చిరుత

ఐసిఎఫ్, జూలై 29: తిరునల్వేలి జిల్లా పనకుడిలో తోటలో మేత మేస్తున్న 10 మేకలను చిరుతపులి చంపింది. పనకుడి రోస్మియాపురానికి చెందిన హరిరామ్ తోట పశ్చిమ కనుమల లోయలో ఉంది. వ్యవసాయంతో పాటు 30కి పైగా గొర్రెలు, మేకలు పెంచుతున్నారు. ఆదివారం రాత్రి వాటిని తోటలో వదిలేసి ఇంటికెళ్లాడు. సోమవారం వేకువజామున తోటకు వెళ్లిన హరిరామ్, చిరుత కాలిముద్రలు ఉండడాన్ని గుర్తించి దిగ్భ్రాంతి చెందాడు. 10కి పైగా మేకలు మృతిచెంది ఉండడం గుర్తించి అటవీ శాఖ అధికారులకు తెలిపాడు. అక్కడకు చేరుకున్న అధికారులు చిరుత కాలి ముద్రలు పరిశీలించి, దాని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# దేశంలోనే ప్రశాంతమైన రాష్ట్రం తమిళనాడు

- ప్రతీకారం, పాతకక్షల కారణంగానే హత్యలు
- మంత్రి రఘుపతి


మంత్రి రఘుపతి

పెరంబూర్, జూలై 29: రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, దేశంలోనే తమిళనాడు ప్రశాంత వాతావరణ కలిగిన రాష్ట్రంగా ఉందని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి రఘుపతి తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ప్రతిపక్షనేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపణలకు సోమవారం మంత్రి రఘుపతి సమాధానమిచ్చారు. ప్రతీకారం, పాతకక్షల కారణంగా రాష్ట్రంలో హత్యా ఘటనలు జరుగుతున్నాయని, అదే సమయంలో హింసాత్మక ఘటనలు జరగడం లేదన్నారు. పుదుచ్చేరిలో జరిగిన హత్యలు కూడా రాష్ట్రంలో జరిగాయంటూ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హింసాత్మక ఘటనలతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. రాష్ట్ర జనాభా అనేక రెట్లు పెరిగిందని, తదనుగుణంగా ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయని, అందుకు ప్రభుత్వం ఎలా బాధ్యత వహిస్తుందని ప్రశ్నించారు. ఎవరెవరి మధ్య పాతకక్ష్యలున్నాయని ప్రభుత్వం ఆరా తీస్తోందని, రౌడీల జాబితా తయారుచేసి, వారు ఎవరితో శత్రుత్వం ఉందో గుర్తించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. నేటికీ శాంతి భద్రతల నిర్వహణలో తమిళనాడు భారతదేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. అందువల్లే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు బహుళజాతి సంస్థలు, పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కానీ, ఈపీఎస్ లాంటి వాళ్లు తమ ఆరోపణలతో రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లాలని భావిస్తున్నారని, వారి కలలు ఎన్నటికీ నెరవేరవన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పర్యవేక్షించి, ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు.

# వరినారుకు పెరిగిన డిమాండ్

ముమ్మరంగా సాగు పనులు


వరినాట్లు వేస్తున్న కూలీలు

పెరంబూర్, జూలై 29: డెల్టా జిల్లాల్లో రైతులు ముమ్మరంగా సాగు పనులు చేపట్టారు. వర్షాలు ఆశించినంతగా కురవకపోవడం, మేట్టూరు డ్యాంలో కూడా నీరు లేకపోవడంతో, ఈ ఏడాది జూన్‌లో ప్రారంభం కావాల్సిన సాగుపనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. విద్యుత్ మోటార్ల సౌకర్యం, వ్యవసాయ బావులున్న రైతులు మాత్రం నీరు అందుతుండడంతో సాగు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలతో ఆ రాష్ట్రంలోని డ్యాంల నుంచి భారీగా విడుదల చేసిన నీటితో మేట్టూరు డ్యాం పూర్తిస్థాయికి చేరువైంది. దీంతో, ఆదివారం నుంచి మేట్టూరు డ్యాం నుంచి నీరు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీచేశారు. డ్యాంలో సమృద్ధిగా నీరున్న నేపథ్యంలో, డెల్టా జిల్లాల్లో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. ఇప్పటికే వరి నార్లు కొనుగోలు చేసిన రైతులు, నాట్లు వేస్తున్నారు.. దీంతో, వరి నార్లకు భారీ డిమాండ్ ఏర్పడంతో, రైతులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

## 11న బీజేపీ జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, జూలై 29: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నేతృత్వంలో ఆగస్టు 11వ తేది ఆ పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశం తిరుప్పూర్‌లో జరుగనుంది. అన్నామలై వచ్చే నెలలో విదేశీ పర్యటనకు వెళ్లనున్న తరుణంలో, స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణ, పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు. ఈ సమావేశంలో పాల్గొనాలని 66 మంది జిల్లా కార్యదర్శులకు వర్తమానం పంపిన నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి అరవింద్ మేనన్, రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదతరులు పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

## ఈదురుగాలులతో రోప్‌కార్ సేవలకు అంతరాయం


పళని స్టేషన్‌లోని రోప్‌కార్

పెరంబూర్, జూలై 29: ఈదురుగాలుల కారణంగా పళని ఆలయానికి వెళ్లే రోప్‌కార్ సేవలు నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపై ఉన్న ఈ ఆలయానికి మెట్ల మార్గంగా వెళాల్సి రావడంతో, వృద్ధులు, పిల్లల కోసం రోప్‌కార్, వించ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆడి మాసం ప్రారంభం నుంచే ఈ ప్రాంతంలో గాలులు బలంగా వీస్తున్నాయి. దీంతో, రోప్‌కార్ సేవలకు అంతరాయం కలుగుతోంది. సాధారణంగా ఉదయం 7.30 గంటలకు రోప్‌కార్ సేవలు ప్రారంభమవుతుండగా, ఆ సమయంలో గాలులు బలంగా వీస్తుండడంతో రోప్‌కార్ సేవలు ప్రారంభం కాలేదు. సాయంత్రం 5.30 గంటల వరకు గాలుల వేగంలో మార్పు లేకపోవడంతో రోప్‌కార్ సేవలు నిలిపివేశారు. దీంతో, మెట్లు, వించ్ ద్వారా భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. కాగా, ఇటీవల ఈరోడ్ జిల్లాలోని కొండ ఆలయానికి వెళ్లే రోప్‌కార్ మధ్యలో నిలిచిపోయి భక్తులు ఇబ్బందులు పడిన ఘటన చోటుచేసుకోవడంతో, భక్తుల భద్రత దృష్ట్యా రోప్‌కార్ సేవలు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

## ఆరుబయట విద్యా బోధన


ఆరు బయట విద్యా బోధన చేస్తున్న దృశ్యం

పెరంబూర్, జూలై 29: కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి సమీపం ఆర్.గోపాలపురం పంచాయతి యూనియన్ ప్రాథమిక పాఠశాలను 2021లో ఉన్నత పాఠశాల హోదా పెంచారు. హోదా పెంచినా తగిన తరగతి వసతులు ఏర్పాటుకాలేదు. పాఠశాల మొత్తం విస్తీర్ణం 25 సెంట్లు కాగా, అందులోనే 20 మంది పిల్లలతో అంగన్వాడీ కేంద్రం కూడా ఉంది. రెండు భవనాలు, ఐదు తరగతులతో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 119 మంది విద్యార్థులుండేవారు. అనంతరం హోదా పెంచడంతో ప్రస్తుతం 175 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ భవనాల్లో ఉన్న మూడు గదుల్లో 10వ తరగతికి ఒక గది, 9వ తరగతికి మరో గది, ప్రధానోపాధ్యాయులు, కార్యాలయం, 8వ తరగతి, టీచర్ల గదితో మరో భవనం ఉంది. ఇక, 6,7 తరగతులకు గదులు లేకపోవడంతో పాఠశాల ప్రాంగణంలోనే ఆరుబయట బెంచీలు వేసి బోధన సాగుతోంది. ప్రభుత్వం స్పందించి పాఠశాలకు తగిన స్థలం, భవన వసతి ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రూ.67.41 కోట్ల విలువైన ఆలయ భూమి స్వాధీనం

పెరంబూర్, జూలై 29: తిరువారూరులో రూ.67.41 కోట్ల విలువైన ఆలయ భూమిని దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణలకు గురైన ఆలయాల భూములు, స్థలాలను దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంటోంది. ఈ క్రమంలో, తిరువారూర్‌లో పిళ్లయార్ ఆలయానికి చెందిన 1,68,528 చ.అ భూమిని సోమవారం అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు దేవాదాయ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## నేటినుంచి తిరుచ్చిలో ఉదయనిధి పర్యటన

అడయార్, జూలై 29: రాష్ట్ర మంత్రి, డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు ఉదయనిధి బుధ, గురువారాలు తిరుచ్చిలో పర్యటించనున్నారు. ఇందుకోసం ఈ నెల 31న చెన్నై నుంచి తిరుచ్చికి విమానంలో చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో వెళ్లి నంబర్ 1 టోల్‌గేట్ ప్రాంతంలో నిర్మించిన ఆస్పత్రిని ప్రారంభిస్తారు. ఆ తర్వాత సూరియూర్ ఎలందైపట్టిలో సిప్‌కాట్, ఒలింపిక్ స్టేడియం నిర్మించనున్న ప్రాంతాలను పరిశీలిస్తారు. జల్లికట్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలిస్తారు. ఆ రాత్రి ప్రభుత్వ అతిథి గృహంలో బస చేసిన ఒకటో తేదీ అందనల్లూరు తిరుప్పరాయ్‌దురైలో ప్రభుత్వం పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహార పథకం అమలు తీరు పరిశీలిస్తారు. అలాగే, జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. రెండు రోజుల తిరుచ్చి జిల్లా పర్యటన ముగించుకుని ఈరోడ్ జిల్లా పర్యటనకు వెళతారు.

## అవయవదానంతో పలువురికి పునర్జన్మ

అడయార్, జూలై 28: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన కాలేజీ విద్యార్థి అవయవాలను మృతుడి తల్లిదండ్రులు దానం చేసి, పలువురికి పునర్జన్మ ప్రసాదించారు. తిరుపూరు 15 మేల్‌పాళెయం ప్రాంతానికి చెందిన నరేన్ (17) అనే యువకుడు కోవైలోని కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ నెల 17వ తేదీ తన స్నేహితులతో కారులో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే నరేన్‌ను కోవైలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పగా, ఆదివారం బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. దీంతో నరేన్ తల్లిదండ్రులు బిడ్డను కోల్పోయిన దుఃఖంలో ఉన్నప్పటికీ అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో నరేన్ గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, ఎముకలు, చర్మం, నేత్రాలను ఆపరేషన్ ద్వారా వైద్యులు సేకరించారు. మృతదేహానికి సోమవారం ప్రభుత్వం తరఫున వైద్యులు నివాళులర్పించిన మృతదేహాన్ని నరేన్ తల్లిదండ్రులకు అప్పగించారు.

## నకిలీ ప్రొఫెసర్ల నియామకం .... 295 ఇంజనీరింగ్ కళాశాలలకు నోటీసు

ప్యారీస్, జూలై 29: నకిలీ ప్రొఫెసర్ల నియమాకం వ్యవహారంలో వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాల్సిందిగా సంబంధిత 295 ఇంజనీరింగ్ కళాశాలలకు అన్నా విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. అన్నా విశ్వవిద్యాలయం పరిధిలో 470కి పైగా ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. ఇందులో ఆధార్ నెంబరును అక్రమంగా ఉపయోగించి కొంతమంది ప్రొఫెసర్లుగా ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న విషయం వెలుగులోకొచ్చింది. భారీస్థాయిలో జరిగిన ఈ అవినీతిలో విద్యాశాఖకు సంబంధించిన సుమారు 800 మందికి పైగా సంబంధాలున్నట్లు చెబుతున్నారు. ఈ కేసును అన్నా విశ్వవిద్యాలయం నియమించిన ముగ్గురితో కూడిన ప్రత్యేక కమిటీ విచారణ జరుపుతోంది. అవినీతికి పాల్పడిన ప్రొఫెసర్లను విచారణకు పిలవాలని కమిటీ నిర్ణయించింది. అవినీతికి పాల్పడిన కళాశాలల యాజమాన్యం వివరణ కోరుతూ అన్నా విశ్వవిద్యాలయం నోటీసు పంపింది. ఈ మేరకు వైస్ చాన్సలర్ ఆర్.వేల్‌రాజ్ మాట్లాడుతూ... ప్రైవేటు సంస్థ అందజేసిన ఫిర్యాదు ఆధారంగా జరిపిన విచారణలో నకిలీ ప్రొఫెసర్లు ఉద్యోగంలో చేరినట్లు తెలుసుకోగలిగామని తెలిపారు. ఇదిలా ఉండగా, అన్నా వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ సూరప్ప తన ఎక్స్ పేజీలో... తాను వీసీగా ఉన్న సమయంలోనే ఇలాంటి అవినీతి జరిగిందని, దీనిపై తాను తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఒక కళాశాల లైసెన్స్ రద్దు చేయడంతోపాటు మరికొన్ని కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ సంఖ్య కూడా కుదించామని తెలిపారు.

## విజయ్ పార్టీ వల్ల బీజేపీకి ఎలాంటి నష్టం లేదు

- తమిళిసై

ప్యారీస్, జూలై 29: సినీ హీరో విజయ్ రాజకీయ పార్టీ ప్రారంభించడం వల్ల బీజేపీకి ఎలాంటి నష్టం ఉండదని ఆ పార్టీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ పేర్కొన్నారు. వేలూరు జిల్లా గుడియాత్తంలోని ప్రకృతి వైద్యశాలలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత, తన తండ్రి కుమరి అనంతన్‌ను తమిళిసై వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... కర్ణాటక ప్రభుత్వం కావేరి నదీజలాలను రాష్ట్రానికి విడుదల చేయనున్నప్పటికీ, ప్రకృతి కరుణించి కావేరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురిపిస్తోందని, ఈ నీటిని సేకరించడంతో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం అమలుపరుస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వల్ల పలు రాష్ట్రాల్లో బీజేపీ అభివృద్ధి కనిపిస్తోందని, రాష్ట్రంలో కూడా బలపడుతోందన్నారు.

## సబ్ జైళ్ల మూసివేత సరికాదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్యారీస్, జూలై 29: రాష్ట్రంలో సబ్ జైళ్లను మూసివేయరాదని రాష్ట్రప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో భద్రతా లోపం, కనీసవసతులు లేని కారణంగా 18 సబ్ జైళ్లను మూసివేసేందుకు డీఎంకే ప్రభుత్వం నిర్ణయించినట్లు వార్తలొచ్చాయని, వాటిని మూసివేసే నిర్ణయాన్ని ప్రభుత్వం పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో నేరపూరిత సంఘటనలు రోజురోజుకు పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో, సబ్ జైళ్లలో ఖైదీల సంఖ్య కూడా పెరుగుతోందని, ఇప్పటికే కేంద్ర కారాగారాల్లో ఖైదీలను బంధించేందుకు అవసరమైన స్థలం అందుబాటులో లేదని అన్నామలై తెలిపారు.

## 16 అడుగుల స్వర్ణభైరవ విగ్రహ ప్రతిష్ఠ



పెరంబూర్, జూలై 29: శివగంగ జిల్లా దేవకోట సమీపంలో 16 అడుగుల స్వర్ణ భైరవుడి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వెలిముత్తి విలకు పట్టుకురుకాల్ నగర్‌లో ఆదివారం సాయంత్రం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణ భైరవుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్య - వైద్య రంగాల పరిరక్షకుడు సీఎం స్టాలిన్

- ఆర్‌ఎస్ భారతి ప్రశంస

అడయార్, జూలై 29: విద్య, వైద్య రంగాల పరిరక్షకుడు మన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అని ఆ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరి ఆర్‌ఎస్ భారతి కొనియాడారు. ఆలందూరు దక్షిణ డీఎంకే 162వ విభాగం ఆధ్వర్యంలో కలైంజర్ శతజయంతి వేడుకల ముగింపు వేడుకలు ఆదివారం రాత్రి జరిగాయి. ఈ వేడుకల్లో 170 మంది పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల విద్యా ఉపకరణాలను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ భారతి ప్రసంగిస్తూ, సమాజానికి విద్య, వైద్యం రెండు నేత్రాల వంటివన్నారు. ఈ రెండింటిని రక్షించే పరిరక్షకుడుగా మన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉన్నారనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నట్టు తెలిపారు. స్థానిక డీఎంకే నేతలు పాల్గొన్నారు.

## ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో నిందితుల ఆస్తుల జప్తు?

అడయార్, జూలై 29: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టయిన నిందితుల ఆస్తులను జప్తు చేసే దిశగా పోలీసులు దృష్టిసారించారు. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 21 మందిని అరెస్టు చేయగా, వీరిలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన వారున్నారు. అయితే, అరెస్టు చేసిన నిందితుల ఆస్తుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మరోవైపు, ఆదివారం అరెస్టు చేసిన ముఖిలన్, విజయకుమార్, విఘ్నేష్‌లకు నాటు బాంబులు సరఫరా చేసిన రాజేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అదేవిధంగా ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరు నిందితులు విదేశాలకు పారిపోయినట్టుగా భావిస్తున్నారు. వీరికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

## మెడికల్‌షాపుల్లో గర్భనిరోధక మందులపై నిషేధం

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు మందుల దుకాణాలలో గర్భ నిరోధక మందుల విక్రయంపై నిషేధం విధించినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో సోమవారం ఉదయం ప్రసవ మరణాల నిరోధక చర్యలపై ఏర్పాటైన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత మూడేళ్లుగా రాష్ట్రంలో ప్రసవ సమయాల్లో మహిళల మృతుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు మందుల దుకాణాల్లో గర్భనిరోధక మందులు విక్రయించకుండా నిషేధం విధించామని, ఈ విషయమై వైద్యశాఖ అధికారులు తరచూ ఆ మందుల దుకాణాలపై నిఘావేసి ఆకస్మిక తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకుంటారని కూడా చెప్పారు.

### శాసనసభలో గుట్కా...!

## రేపు డీఎంకే ఎమ్మెల్యేల కేసులో తీర్పు

పెరంబూర్, జూలై 29: శాసనసభలో గుట్కా తీసుకొచ్చిన వ్యవహారంలో దాఖలుచేసిన అప్పీలు పిటిషన్‌పై బుధవారం తీర్పు వెలువరించనున్నట్లు మద్రాసు హైకోర్టు ప్రకటించింది. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు రాష్ట్రంలో యదేచ్ఛగా సాగుతున్నాయని అప్పటి ప్రతిపక్ష డీఎంకే ఆరోపించింది. అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆ పార్టీకి చెందిన 18 మంది ఎమ్మెల్యేలు శాసనసభలోకి గుట్కా తీసుకొచ్చి వాటిని చూపిస్తూ ఆరోపణలు చేశారు. దీంతో వారికి వ్యతిరేకంగా సభా హక్కుల కమిటీ పంపిన నోటీసులను వ్యతిరేకిస్తూ, ఎంకే స్టాలిన్ సహా 18 మంది మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు విచారించిన న్యాయస్థానం, నోటీసులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దానిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర శాసనసభ కార్యదర్శి, అప్పటి సభా హక్కుల కమిటీ అధ్యక్షుడు, డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్ మద్రాసు హైకోర్టులో అప్పీలు పిటిషన్ వేశారు. మూడున్నరేళ్లుగా సాగిన ఈ కేసును న్యాయమూర్తులు ఎస్ఎం.సుబ్రమణ్యం, న్యాయమూర్తి సి.కుమరప్పన్ నేతృత్వంలో ధర్మాసనం విచారించింది. ఈ కేసులో వాదోపవాదనలు పూర్తికావడంతో బుధవారం తీర్పు వెలువరించనున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

## 3న రామలింగ చౌడేశ్వరిదేవి కపిరి మహోత్సవం

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని మానెల్లూరు గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి కపిరి మహోత్సవం ఆగస్టు 3వ తేదీ జరుగనుంది. ఇందులో భాగంగా ఆగస్టు 2, సాయంత్రం 5 గంటలకు అమ్మవారిని అలంకరించి కొలువు చేస్తారు. 3వ తేదీ రాత్రి 7 గంటలకు కపిరి మహోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా అలగు సేవ, తిరువీధి ఉత్సవం జరుగనుంది. 4వ తేదీ సాయంత్రం వసంతోత్సవం, మాడవీధి ఉత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## నేడు కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో గ్రీవెన్స్

పెరంబూర్, జూలై 29: కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో ప్రజా విజ్ఞప్తుల పరిష్కార శిబిరాలు మంగళవారం జరుగనున్నాయి. పార్లమెంటు ఎన్నికలు, శాసనసభ సమావేశాలు, విక్రవాండి ఉప ఎన్నిక సందర్భంగా ప్రతి నెలా నిర్వహించే ఈ శిబిరాలు మే నుంచి నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం 10 గంటలకు కాంచీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో, చెంగల్పట్టు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ప్రజా సంబంధాల కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ శిబిరాలు జరుగనున్నాయని, ప్రజలు తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని ఆయా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాలు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి.

## సర్టిఫికెట్ల పంపిణీలో జాప్యం వద్దు

ఐసిఎఫ్, జూలై 29: విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీలో జాప్యం వద్దని పాఠశాల విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 7.5 శాతం రిజర్వేషన్ కేటాయించారు. ఇందుకోసం తాము చదివిన పాఠశాలలకు హామీ పత్రం కోరుతూ విద్యార్థులు వస్తున్నారు. ఆ విద్యార్థులు 6 నుంచి 8వ తరగతి వరకు ఒక పాఠశాల, 9 నుంచి ప్లస్ టూ వరకు మరో పాఠశాలలో చదివిన నేపథ్యంలో, చివరగా చదివిన పాఠశాల నుంచి ఈ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుంది. సర్టిఫికేట్ల పంపిణీలో ఆలస్యం జరుగుతున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. ఎమిస్ వెబ్‌సైట్ నుంచి విద్యార్థులకు ఈ సర్టిఫికెట్లు వెంటనే అందజేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది.

## పూర్తయిన పెరుంగళత్తూర్ ఫ్లై ఓవర్ పనులు

ఐసిఎఫ్, జూలై 29: స్థానిక పెరుంగళత్తూర్ జీఎస్‌టీ రోడ్డులో ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయిందని రహదారుల శాఖ అధికారులు తెలిపారు. ఇతర జిల్లాల నుంచి చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారి మీదుగా నగరంలోకి వచ్చే వాహనాలు పెరుంగళత్తూర్ దాటేందుకు అక్కడున్న లెవల్ క్రాసింగ్ వద్ద గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. ఈ ట్రాఫిక్ సమస్య పరిష్కరించేలా పెరుంగళత్తూర్ రైల్వేస్టేషన్ సమీపంలో రూ.234 కోట్లతో 2022లో ప్రారంభమైన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఇటీవల పూర్తయ్యాయని, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

## గూండా చట్టం కింద 16 మంది అరెస్ట్

పెరంబూర్, జూలై 29: నగరంలో నేరాలకు పాల్పడిన 16 మంది గూండా చట్టం కింద అరెస్టయ్యారు. ఈ మేరకు పోలీసు కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో.... పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వులతో నగరంలో శాంతి భద్రతల పర్యవేక్షణకు ప్రత్యేకంగా గస్తీ చేపట్టారు. ఆ ప్రకారం, ఈ నెల 22 నుంచి 28వ తేది వరకు జరిపిన తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ఐదుగురు, హత్యాకేసుల్లో ముద్దాయిలుగా మరో 11 మంది మొత్తం 16 మంది గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. ఇక, ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 27వ తేది వరకు హత్య, హత్యాయత్నం, గంజాయి, గుట్కా తరలింపు, చైన్ స్నాచింగ్, అత్యాచారం, నిత్యావసర వస్తువుల అక్రమ తరలింపు తదితర కేసులకు సంబంధించి మొత్తం 796 మందిని గూండా చట్టం కింద అరెస్ట్ చేసినట్లు నగర పోలీసు కార్యాలయం తెలియజేసింది.

## స్ప్రే యంత్రం పేలి వ్యాపారి మృతి

ఐసిఎఫ్, జూలై 29: కరూర్ సమీపంలో స్ప్రే యంత్రం పేలి వ్యాపారి మృతిచెందాడు. కరూర్ జిల్లా తరగంపట్టి కడవూరు పసుమ్‌పొన్ నగర్‌కు చెందిన పాత ఇనుప వస్తువుల వ్యాపారి కృష్ణమూర్తి, యధావిధిగా చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి పాత వస్తువులు సేకరించాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి సమీపంలో ఉన్న కొట్టాంలోకి వెళ్లి పాత వస్తువులు విభజిస్తూ పంటలకు పురుగుల మందు చల్లే పాత స్ప్రేయర్‌కున్న ఇత్తడి వస్తువులు తీసేందుకు ప్రయత్నించాడు. అనూహ్యంగా అది పేలడంతో కృష్ణమూర్తి దేహం చెల్లాచెదురైంది. ఈ శబ్దం విని కాస్తదూరంలో ఉన్న కుటుంబసభ్యులు బయలకు వచ్చి చూశారు. అవయవాలు చెదిరి పడిన మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరూర్ ప్రభుత్వ వైద్యకళాశాలకు తరలించారు. స్ప్రేలో పెట్రోల్ ఉందని, గాలి పీడనం చేత పేలిందని పోలీసులు తెలిపారు.

## 'ఎంత ఎత్తులో ఉన్నానో చూడు...!'

- వీడియో కాల్ చేస్తూ జారిపడి బాలుడి మృతి

పెరంబూర్, జూలై 29: నాలుగో అంతస్తుపై ఉన్న వాటర్ ట్యాంక్ పైకెక్కి స్నేహితురాలితో వీడియో కాల్ మాట్లాడుతున్న 13 ఏళ్ల బాలుడు కాలుజారి కిందపడి మృతిచెందిన ఘటన విషాదం నింపింది. స్థానిక వడపళని గంగవేల్ కాలనీకి చెందిన బాలాజీ కుమారుడు ప్రజన్ (13) 8వ తరగతి చదువుకుంటున్నాడు. ప్రజన్ ఆదివారం తన స్నేహితుడు కార్తికేయన్‌తో కలసి చదువుకొనేందుకు అదే ప్రాంతంలోని అళగిరినాథర్ మొదటి వీధిలోని అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. ఈ నేపథ్యంలో, మధ్యాహ్నం 3 గంటల ప్రాంతం లో ప్రజన్ నాలుగో అంతస్తులో ఉన్న వాటర్ ట్యాంక్ పైకెక్కి స్నేహితురాలికి వీడియో కాల్ చేసి "నేను ఎంత ఎత్తులో ఉన్నానో చూడు' అని తానున్న ప్రదేశాన్ని చూపుతూ హఠాత్తుగా కాలు జారి పై నుంచి కిందపడ్డాడు. చుట్టుపక్కల వారు బాలుడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై వడపళని పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## 55 శాతం అదనంగా నైరుతి రుతుపవన వర్షాలు

ఐసిఎఫ్, జూలై 29: నైరుతి రుతుపవన వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా 55 శాతం అదనంగా కురిసినట్లు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ వర్షాలు జూన్‌లో ప్రారంభమై సెప్టెంబరు వరకు నాలుగు నెలలు కురుస్తాయి. వీటి ద్వారా రాష్ట్రంలో కన్నియాకుమారి, తేని, కోయంబత్తూర్, నీలగిరి జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదవుతుంది. ఆ ప్రకారం, జూన్ 1 నుంచి ఈ నెల 29వ తేది వరకు రాష్ట్రంలో 179.3 మి.మీ వర్షం కురిసింది. ఈ సమయంలో రాష్ట్రంలో కురిసే సాధారణ వర్షపాతం 115.6 మి.మీ కాగా, 55 శాతం అదనంగా కురిసిందని అధికారులు తెలిపారు.

## కార్పొరేషన్ ఉద్యోగులకు క్రీడా పోటీలు



పెరంబూర్, జూలై 29: కోయంబత్తూర్ కార్పొరేషన్ ఉద్యోగుల క్రీడా పోటీలు ఆదివారం కోలాహలంగా సాగాయి. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్పొరేషన్ పాఠశాలల ఉపాధ్యాయులు మొత్తం 450 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. 40 ఏళ్ల లోపు, 40 ఏళ్ల పైబడిన వారు ఇలా రెండువిభాగాల్లో పోటీలు నిర్వహించారు. పురుషులకు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, చెస్, మహిళలకు త్రోబాల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్ తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

# నటుడిగా మారిన మాలీవుడ్ సింగర్

● కోలీవుడ్‌లో వరుస అవకాశాలు



గుల్ రంజిత్

మలయాళంలో సింగర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ సింగర్ గుల్ రంజిత్ నటుడిగా వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. మలయాళంలో పలు మ్యూజిక్ ఆల్బమ్స్‌తో పాటు లఘు చిత్రాల్లో నటించిన రంజిత్‌ను దర్శకుడు అవతార్ తమిళ చిత్రపరిశ్రమకు పరిచయం చేశారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా పాటలు యూట్యూబ్‌లో విడుదలై ప్రేక్షకాదారణ పొందాయి. ప్రధానంగా ఈ సినిమాలో తండ్రి కుమార్తెల మధ్య అనుబంధాన్ని వివరిస్తూ సాగే 'మగలే.. మగలే...' అనే పాటకు విశేష ఆదరణ వస్తోంది. గతంలో అజిత్ నటించిన సూపర్ హిట్ మూవీ 'విశ్వాసం'లోని 'కన్నానే కన్నే...' పాట కంటే ఈ పాట ప్రతి ఒక్కరి గుండెలు పిండేసేలా సాగుతుంది. అంతేకాకుండా ఈ చిత్రంలో ఆయన 11 యేళ్ళ బాలికకు తండ్రిగా అద్భుతంగా నటించారు. తాను నటించిన తొలి తమిళ చిత్రంలోనే ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే పాత్రలో అద్భుతంగా నటించారంటూ మూవీ యూనిట్ నుంచి ప్రశంసలందుకుంటున్నారు. ఇలా తన తొలి సినిమాతోనే ప్రతి ఒక్కరీ ప్రశంసలందుకుంటున్న గుల్ రంజిత్‌కు దర్శకుడు విఘ్నేష్ శివన్ చిత్రంతో పాటు మరో రెండు చిత్రాల్లో నటించే అవకాశాన్ని అందిపుచ్చుకోవడం గమనార్హం. పైగా తన తొలి చిత్రం విడుదలైతే మరిన్ని సినిమా అవకాశాలు వస్తాయన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నారు.

## చిత్రజ్యోతి

# మీడియాకు క్షమాపణ చెప్పిన యోగిబాబు

● 2న 'బోట్' రిలీజ్

తమిళ సినీ పాత్రికేయులకు ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు క్షమాపణలు చెప్పారు. తాను హీరోగా నటించిన 'బోట్' చిత్రం ఆడియో రిలీజ్‌ తాజాగా నగరంలో జరిగింది. ఈ ఫంక్షన్‌కు ఆయన ఆలస్యంగా వచ్చారు. ఆయన వచ్చే సమయానికి ఆడియో రిలీజ్ వేడుక ముగిసిపోయింది. దీంతో ఆయన మీడియాకు అందరి ముందు క్షమాపణ చెప్పారు. ఓ సినిమా షూటింగ్ లొకేషన్ నుంచి రావడంతో ఆలస్యమైందని అందుకు క్షమించాలని కోరారు. ఇదిలావుంటే, శింబు దేవన్ దర్శకత్వం వహించిన ఈ 'బోట్' చిత్రం ఆగస్టు 2న విడుదల చేస్తున్నారు. యోగిబాబు, గౌరి కిషన్, చిన్ని జయంత్, కులప్పులి లీలా, ఎంఎస్ భాస్కర్, శామ్స్, మధుమిత, షారా, మాస్టర్ ఆకాష్ దాస్‌తో పాటు హాలీవుడ్ నటుడు జెస్సీ ఫోక్స్-ఆలెన్ తదితరులు నటించారు. మాదేష్ మాణిక్యం ఛాయాగ్రహణం అందించగా, జిబ్రాన్ సంగీతం సమకూర్చారు. నడి సముద్రంలో జరిగే ఈ చిత్రాన్ని మాలి అండ్ మాన్వి మూవీ మేకర్స్, శింబు దేవన్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై ప్రేమ్ కుమార్, ప్రభా ప్రేమ్ కుమార్, సి కలైవాణి సంయుక్తంగా నిర్మించారు. ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుకలో దర్శకుడు శింబుదేవన్ మాట్లాడుతూ, 'ఇప్పటివరకు తాను దర్శకత్వం వహించిన చిత్రాల్లో ఫాంటసీ, కామెడీ వంటి అంశాలే ఉన్నాయి. ఈ సినిమాలో ఈ రెండు అంశాలున్నాయి. ఈ మంచి అవకాశాన్ని ఇచ్చిన నిర్మాత ప్రేమ్ కుమార్‌కు ధన్యవాదాలు. ఈ సినిమా ద్వారా నేను కూడా నిర్మాతగా మారాను. కథ చెప్పగానే ప్రేమ్ కుమార్ నాపై నమ్మకంతో ప్రాజెక్టు అప్పగించారు. ఇందులో హీరోగా యోగిబాబు జాలరి పాత్ర పోషించారు. హీరోయిన్ గౌరి కిషన్ పాత్ర భావోద్వేగంతో కూడుకునివుంటుంది. ఈ సినిమాకు సంగీతం, ఛాయాగ్రహణం ఎంతో ముఖ్యం. ఎందుకంటే సముద్రం గురించి నాకు ఏమీ తెలియదు. ప్రతి ఒక్కరిలాగే తీరం ఒడ్డున నిలబడి ఆలల శబ్దాన్ని అలలను నిశితంగా చూస్తుంటాను. పైగా సముద్రంలో షూటింగ్ అంటే ఆషామాషీ కాదు. కొన్ని సమయాల్లో ఉగ్రరూపంలో, మరి కొన్ని సందర్భాల్లో ప్రశాంతంగా ఉంటుంది. ఇలాంటి షూటింగ్‌లో సినిమా తీసే ప్రతి ఒక్కరూ ఎంతో శ్రమించాల్సిందే' అని పేర్కొన్నారు. అలాగే, నిర్మాతలు, ఇతర నటీనటులు ప్రసంగించారు.


'బోట్' చిత్ర యూనిట్‌తో యోగిబాబు

# 8 వారాల తర్వాతే ఓటీటీలకు ఇవ్వాలి

● నిర్మాతల మండలి సమావేశంలో తీర్మానం

స్టార్ హీరోల చిత్రాలను ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీల్లో ప్రసారం చేసేందుకు ఇవ్వాలని తమిళ నిర్మాతల మండలి అధ్యక్షతన జరిగిన వివిధ సంఘాల నిర్వాహకులు ఏకగ్రీవంగా ఓ తీర్మానం చేశారు. సోమవారం తమిళ సినీ నిర్మాతల మండలి. తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తమిళనాడు థియేటర్ యజమానుల సంఘం, తమిళనాడు థియేటర్, మల్టీప్లెక్స్ ఓనర్స్ అసోసియేషన్, తమిళనాడు ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ తదితర సంఘాల నిర్వాహకులు, ప్రతినిధులు పాల్గొని, కీలక తీర్మాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇందులో భాగంగా స్టార్ హీరోలు నటించే కొత్త చిత్రాలను ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలకు ఇవ్వాలని నిర్ణయించారు. ఒక సినిమాకు ముందస్తుగా అడ్వాన్స్ రూపంలో నిర్మాతల నుంచి డబ్బు తీసుకునే నటీనటులు.. ఆ చిత్రాన్ని పూర్తి చేసిన తర్వాతే కొత్త చిత్రానికి ఒప్పందం చేసుకోవాలని తీర్మానించారు. చిత్ర పరిశ్రమలో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారం కోసం జాయింట్ యాక్షన్ కమిటిని ఏర్పాటుచేయాలని ఇందులో నిర్ణయించారు.

# యువ నటుడు శ్రీహరికి ప్రత్యేక అవార్డు



అవార్డు గ్రహీలతతో నిర్వాహకులు

బుల్లితెర, వెండితెరకు చెందిన పలువురు సినీ నటీనటులకు మహాఫైన్ ఆర్ట్స్, యునైటెడ్ ఆర్టిస్ట్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశాయి. వడపళని, కుమరన్ కాలనీలోని శిఖరం హాలులో ఆదివారం రాత్రి జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఫిల్మ్ యాక్టర్ బెస్ట్ న్యూ ఫేస్ స్పెషల్ అవార్డును యువ నటుడు శ్రీహరికి అందజేశారు. అదేవిధంగా, బెస్ట్ డైరెక్టర్ స్పెషల్ అవార్డు ఏఎల్ రాజా, బెస్ట్ ఫిల్మ్ స్పెషల్ అవార్డు యువ నటి రేవతి, బెస్ట్ అఛీవ్‌మెంట్ అవార్డు నటి ప్రేమ ప్రియ, బెస్ట్ క్యారెక్టర్ స్పెషల్ అవార్డు వి.మంగళనాథ కురుక్కల్ అందుకున్నారు. మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్‌కే కృష్ణన్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో మహా ఫైన్ ఆర్ట్స్ సెక్రటరీ డాక్టర్ అనురాధ జయరామన్, తమిళనాడు ఆల్ స్పోర్ట్స్‌మెన్ వెల్ఫేర్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఎంఆర్ సౌందర్‌రాజన్, సీనియర్ సినీ పీఆర్వో నెల్లై సుందర్‌రాజన్, శిఖరం గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పళనిలో ఆడికృత్తిక వేడుకలు

● బారులు తీరిన భక్తులు


పళని అన్నదానం కూడమ్ వద్ద దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పళని దండాయుధపాణి ఆలయంలో సోమవారం ఉదయం ఆడికృత్తిక వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజాము నాలుగు గంటలకే ఆలయ ప్రధానార్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, అలంకరణ చేసి భక్తులకు విశ్వరూప దర్శనం కల్పించారు. ఆడికృత్తిక సందర్భంగా స్వామివారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన వేలాదిమంది భక్తులు వేకువజామునే క్యూలైన్లలో నిలిచారు. ఆడికృత్తికను పురస్కరించుకుని స్వామివారు రాజ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇదేవిధంగా వేల సంఖ్యలో భక్తులు పుష్పకావళ్లు, పాలకావళ్లను తెచ్చి స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పళని పర్వతాలయం దిగువ సోమవారం మధ్యాహ్నం నుంచి భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది.

## ఒలింపిక్ క్రీడాకారులకు విద్యార్థుల శుభాకాంక్షలు


ఒలింపిక్స్ లోగో నమూనాలో కూర్చున్న విద్యార్థులు


పెరంబూర్, జూలై29:ఒలింపిక్స్ పోటీల్లో భారత క్రీడాకారులు ప్రతిభ కనపరిచి, ఎక్కువ పతకాలు సాధించాలని కోరుతూ పాఠశాల విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేసే కార్యక్రమం తిరుప్పూర్ జిల్లాలో జరిగింది. పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారత్ తరఫు పలు పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటున్నారు. వారికి శుభాకాంక్షలు తెలిపేలా పూలవాడి ప్రభుత్వ మహోన్నత పాఠశాల విద్యార్థులు, ఒలింపిక్స్ లోగో తరహాలో కూరున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సెంథిల్‌కుమార్ నేతృత్వంలో వ్యాయామ ఉపాధ్యాయులు తమిళ్‌సెల్వన్, బెంజిమెన్, ఉప ప్రధానోపాధ్యాయులు ముత్తుకుమారస్వామిలుఏర్పాట్లు పర్యవేక్షించారు.

## అలరించిన 'హే గోవింద' సంగీత కచేరి



అడయార్, జూలై 29: ప్రముఖ సేవా సంస్థ ఏఐఎం ఆధ్వర్యంలో 'హే గోవింద' పేరుతో జరిగిన సంగీత కచేరి అలరించింది. ఆళ్వార్‌పేటలోని మ్యూజిక్ అకాడెమీలో జరిగిన ఈ సంగీత విభావరిలో జయతీర్థ్ మేవుండి, ప్రవీణ్ గాడ్జిండి తదితర సంగీత విద్వాంసులతో కూడిన బృందం ఆలపించిన భక్తి గీతాలు, భజన పాటలు ఆహూతుల హృదయాలను రంజింపచేశాయి. 2000 సంవత్సరంలో స్వామి దయానంద సరస్వతి స్థాపించిన ఏఐఎం సంస్థ... సమాజ మార్పు కోసం పని చేస్తున్న ఒక చారిటబుల్ సంస్థ. ఇందులో భాగంగా, 'హే గోవింద్' పేరుతో నిర్వహించిన సంగీత కచేరిలో జయతీర్థ మేవుండి గాత్రానికి ప్రవీణ్ గోడ్ఖండి (ఫ్లూట్), నరేంద్ర ఎల్ నాయక్ (హార్మోనియం), సూర్యకాంత్ గోపాల్ సర్వే రిథమ్), సుఖద్ మాణిక్ ముండే (పఖ్వాజ్), యశ్వంత్ వైష్ణవ్ (తబలా)పై వాద్య సహకారం అందించారు.

## ఘనంగా గుడ్‌నెస్ పదో వార్షిక వేడుకలు



అడయార్, జూలై 29: నగరానికి చెందిన గుడ్‌నెస్ ఫౌండేషన్ పదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.. ఈ వేడుకల్లో ప్రభుత్వ సహకార సంఘ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జే రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదో వార్షికోత్సవ సందర్భంగా పదిమందికి గుడ్‌నెస్ లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో గుడ్‌నెస్ ఫౌండేషన్ డైరెక్టర్ వాసంతి, నిర్వాహకులు సంతోష్ ప్రతాప్, మణికంఠన్, డాక్టర్ రాజా ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడ్‌నెస్ ఫౌండేషన్ ఎగ్మోర్ ప్రాజెక్టుకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన నృత్యం ఆహూతులను అమితంగా అలరించింది. అలాగే ఫౌండేషన్‌కు చెందిన ఎనిమిది మంది పట్టభద్రులైన విద్యార్థులకు డాక్టర్ రాధాకృష్ణన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డులు అందుకున్న వారిలో పౌన్‌రాజ్ స్టీఫెన్, మరియా గిస్లెన్, అయ్యప్పన్, మోసెస్ డేవిడ్ రాజ్, బాలకుమార్ తంగవేలు, జి.తంగరాజ్, రాచెల్ విక్టర్, వారీందర్ సింగ్ సాహ్నీ, సీతాదేవి, ప్రణీత్ తిమోతిలు ఉన్నారు.

'హరోం..హర ' నినాదాలతో

# దద్దరిల్లిన కుమారస్వామి క్షేత్రాలు

వైభవంగా ఆడికృత్తిక వేడుకలు ● తిరుత్తణిలో లక్షకు పైగా కావళ్ల సమర్పణ


తిరుత్తణి కొండపై కావళ్లు మోసుకెళుతున్న భక్తులు


తిరుత్తణి ఆలయంలో ఉత్సవమూర్తులను దర్శనం చేసుకుంటున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, అధికారులు

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా తిరుత్తణి, తిరుచెందూరు, పళని, కుండ్రత్తూరు, మరుదమలై, స్వామిమలై, తిరుప్పరంకుండ్రం, వడపళని, కందకోట్టమ్, తిరుప్పోరూరు, సిరువాపురి, ఆండార్‌కుప్పం తదితర క్షేత్రాలు 'హరోం...హర...మురుగయ్యా' అంటూ భక్తిపారవశ్యంతో చేసిన నినాదాలతో దద్దరిల్లాయి. గత రెండు రోజులుగా ఈ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తిరుత్తణి, కుండ్రత్తూరు, వల్లకోట్టై మురుగన్ ఆలయాల్లో సోమవారం వేకువజామునే లక్షలాదిమంది భక్తులు స్వామివారి దర్శనం కోసం, మొక్కుబడులను కావళ్ల రూపంలో సమర్పించేందుకు బారులు తీరారు.

**తిరుత్తణిలో...:** తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మూడు రోజులుగా భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం జరిగిన భరణి ఉత్సవంలో సుమారు లక్ష మంది భక్తులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఆడి కృత్తిక సందర్భంగా దేశం నలుమూలల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. తిరుత్తణి నగరం నలువైపులా కావళ్లతోనూ, వంటికి, నోటికి, వీపునకు శూలాలు గుచ్చుకుని వచ్చిన భక్తులతో సందడిగా మారాయి. స్వామివారికి అర్చకులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి స్వర్ణకవచం, స్వర్ణకిరీటాన్ని ధరింపజేశారు. దీపారాధన తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. కొండ దిగువ, కొండపైనా భక్తులు పూల కావళ్లు, పాల కావళ్లు, పన్నీరు కావళ్లు ఇలా వివిధ రకాల కావళ్లను మోసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. ఆలయ నిర్వాహకుల సమాచారం మేరకు సోమవారం ఆలయంలో లక్షకు పైగా కావళ్లను భక్తులు సమర్పించారు. ఈ వేడుకలకు విచ్చేసిన భక్తుల్లో యాభై శాతం మంది తలనీలాలను కూడ సమర్పించుకున్నారు. సోమవారం రాత్రి నుంచి మూడు రోజులపాటు శరవణతీర్థంలో తెప్పోత్సవం జరుగనుంది.. ఆడికృత్తిక సందర్భంగా రాష్ట్రదేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ఆ శాఖ అధికారులు స్వామివారిని దర్శించారు. ఆ తర్వాత పర్వతాలయం వద్ద భక్తులకు కల్పించిన వసతులను పరిశీలించారు.


వడపళని ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లలో వేచి ఉంటున్న భక్తులు

**వడపళనిలో...:** నగరంలోని వడపళని మురుగన్ ఆలయంలోనూ ఆడికృత్తిక వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వేకువజామునే స్వామివారి దర్శనం కోసం నగరం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. వేకువజాము నాలుగు గంటలకే ఆలయాన్ని తెరచి మూలవర్లకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, దీపారాధన నిర్వహించారు. ఐదు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. రాత్రి 11 గంటల వరకు దర్శనాలకు అనుమతించారు. ఉదయం ఆరు నుండి మధ్యాహ్నం 12 గంటల దాకా స్వామివారు చందనతాపడ అలంకారంలో, సాయంత్రం నాలుగు వరకు రాజ అలంకారంలో, తరువాత రాత్రి 11 గంటల దాకా పుష్పాంగి అలంకారంలోనూ కనువిందు చేశారు. వడపళని, విరుగంబాక్కం, సాలిగ్రామం పరిసర ప్రాంతాల నుండి భక్తులు పూల కావళ్లు, పాల కావళ్లు, పన్నీర్‌కావళ్లతో వచ్చి స్వామివారికి సమర్పించారు. ఇదే విధంగా కుండ్రత్తూరు, తిరుచెందూరు, స్వామిమలై, స్థానిక ప్యారీస్ కార్నర్ కందకోట్టమ్ కందస్వామి ఆలయంలోను, పొన్నేరి సమీపంలోని అండార్‌కుప్పం బాలదండాయుధపాణి ఆలయంలో, సిరువాపురి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోనూ ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

# ఆగస్టు 30 నుంచి కార్ రేస్


మీడియా సమావేశంలో పాల్గొన్న అధికారులు, నిర్వాహకులు తదితరులు

ప్యారీస్, జూలై 29: దేశంలోనే మొట్టమొదటిసారిగా ఫార్ములా రేసింగ్ సర్క్యూట్ నైట్ కార్ రేస్‌కు గ్రేటర్ చెన్నై ముస్తాబవుతోంది. మెరీనా బీచ్ రోడ్డులో ఉన్న ఐల్యాండ్ గ్రౌండ్‌లో ఈ మ్యాచ్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఆగస్టు 30, సెప్టెంబరు 1వ తేదీల్లో ఐల్యాండ్ గ్రౌండ్ చుట్టుపక్కల ఉన్న రోడ్లలో రాత్రి వేళ కార్ రేస్ జరుగనుంది. ఐల్యాండ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డు, అన్నాసాలై, స్వామి శివానంద రోడ్డు, నేపియర్ వంతెన మీదుగా మళ్లీ ఐల్యాండ్ గ్రౌండ్‌లో ముగుస్తుంది. 19 మలుపులు, పొడవైన తారు రోడ్డు మీదుగా కార్ రేస్ సాగనుంది. ఇక, ప్రేక్షకుల కోసం ప్రత్యేక గ్యాలరీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా రాత్రి సమయంలో రోడ్డు మార్గంలో జరిగే అతిపెద్ద కార్ రేస్‌గా గుర్తింపు పొందనుంది. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ ఫార్ములా కార్ రేస్‌లో అంతర్జాతీయ, జాతీయ కార్ రేస్‌ల్లో పాల్గొని పతకాలు సాధించిన పురుషులు, మహిళా డ్రైవర్లు పాల్గొననున్నారు. 3.5 కి.మీ మేర చెన్నై ఫార్ములా రేసింగ్ సర్క్యూట్, తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్‌తో కలసి రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అద్భుతంగా రూపొందించింది. కార్ రేస్‌కు సంబంధించి నందంబాక్కంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో క్రీడాభివృద్ధి శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ప్రొఫెసర్ అతుల్య మిశ్రా, తమిళనాడు క్రీడాభివృద్ధి శాఖ అథారిటీ సీఈవో జె.మేఘనాథరెడ్డి, రేసింగ్ ప్రమోషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి తదితరులు పాల్గొని వివరించారు. అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ... ఆగస్టు 30, సెప్టెంబరు 1వ తేది వరకు జరుగనున్న ఫార్ములా కార్ రేస్ మోటారు క్రీడల్లో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందన్నారు. ఆగస్టు 22, 23 తేదీల్లో ప్రయోగాత్మక కారు రేస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత 24, 25 తేదీల్లో మద్రాసు ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో నిర్వహించనున్న తొలి రౌండ్ జరుగుతుందని, ఈ సీజన్‌లో మొత్తం 8 జట్లు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

## హిజ్రా సంధ్యాదేవికి ఉత్తమ సేవా అవార్డు

● ప్రదానం చేసిన సీఎం స్టాలిన్


సంధ్యాదేవికి అవార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హిజ్రాలకు విశిష్ట సేవలందించిన కన్నియాకుమారి జిల్లాకు చెందిన హిజ్రా సంధ్యాదేవికి 2024 సంవత్సరానికిగాను అత్యుత్తమ సేవా అవార్డును ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు సోమవారం ఉదయం సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ అవార్డును ప్రదానం చేశారు. కన్నియాకుమారి జిల్లా దోవాళై ప్రాంతానికి చెందిన సంధ్యాదేవి పూలు కడుతూ జీవనం సాగిస్తున్నారు. విల్లుపాట్టుపై ఆసక్తి పెంచుకుని ఆ విల్లుపాటు కళాకారిణిగా మారి పౌరాణిక గాథలను చెబుతున్నారు. ఇప్పటివరకు 1000కి పైగా కచేరీలు చేశారు. అంతే కాకుండా కరోనా సమయంలో ప్రజలలో ఆ వైరస్‌పై అవగాహన కల్పించేలా ప్రదర్శనలు కూడా ఇచ్చారు. హిజ్రాలకు ఆదర్శంగా నిలిచిన సంధ్యాదేవిని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ నాయకత్వంలోని కమిటీ ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. ఆ మేరకు సచివాలయంలో సీఎం చేతుల మీదుగా రూ.లక్ష నగదు పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గీతాజీవన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ వి. అముదవల్లి తదితరులు పాల్గొన్నారు.


# సమస్యలపై ఉద్యమించిన ఉపాధ్యాయులు : 1,500 మంది అరెస్ట్




ఉపాధ్యాయులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు - లయోలా కళాశాల వద్ద రాస్తారోకో

పెరంబూర్, జూలై 29: పదోన్నతులకు భంగం కలిగించే జీవో నెం.243 రద్దు, పాత పింఛన్ విధానం అమలు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల వేతన వ్యత్యాసాల తొలగింపు సహా 31 అంశాలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తమిళనాడు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం నుంచి మూడు రోజులు నుంగంబాక్కంలోని డీపీఐ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో డీపీఐ కార్యాలయం వద్ద ఆందోళనలో పాల్గొన్న 1,500 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉపాధ్యాయులు కార్యాలయానికి వచ్చే ముందే బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. అలాగే, ఆందోళనలో పాల్గొనేందుకు నుంగంబాక్కం రైల్వేస్టేషన్ నుంచి లయోలా కాలేజ్ బస్టాండ్ వద్దకు చేరుకున్న ఉపాధ్యాయులను, పోలీసులు అక్కడే అరెస్ట్ చేసి బస్సుల్లో తీసుకెళ్లారు. ఈ విషయమై ఉపాధ్యాయులు మాట్లాడుతూ... ఆందోళనలకు ముందే ఉపాధ్యాయులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. గతంలో 30 కోర్కెలతో డీపీఐ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన సమయంలో, 12 కోర్కెలు పరిష్కరిస్తామని ప్రాథమిక విద్యా డైరెక్టర్ హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం పదోన్నతులకు ఇబ్బందిగా ఉన్న 243 జీవో రద్దు చేయాలనే డిమాండ్‌తో 31 డిమాండ్ల సాధనకు తాము ఆందోళన చేపట్టామని తెలిపారు. ఈ జీవో కారణంగా సుమారు లక్ష మంది ఉపాధ్యాయులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకొచ్చి, ఉపాధ్యాయ సంఘాల నేతలతో చర్చించాలని వారు డిమాండ్ చేశారు.


చెన్నై గోపాలపురంలోని పౌరసరఫరాల వాణిజ్య సంస్థ గోదాములోని ఆహారధాన్యాల నాణ్యతను పరిశీలిస్తున్న ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జే రాధాకృష్ణన్


చెన్నై జార్జిటౌన్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆడికృత్తిక సందర్భంగా సోమవారం సాయంత్రం నెమలివాహనంపై దర్శనమిచ్చిన సుబ్రహ్మణ్యస్వామి



సోమవారం చెన్నైలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ దిండుగల్ లోక్‌సభ నియోజకవర్గం పార్టీ నిర్వాహకులతో సమావేశమైన పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి